## 'నందమూరినగర్ సమస్యలు పరిష్కరిస్తా'


నందమూరినగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: నందమూరినగర్ బస్తీ సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించి, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కలిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మంగళవారం ఆరో వార్డు పరిధిలోని నందమూరినగర్ బస్తీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, అంతర్గత రోడ్ల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు బోర్డు అధికారులతో చర్చించి సూచనలు చేస్తామన్నారు. బస్తీని ఆనుకుని ఉన్న మురుగుకాలువను పరిశీలించారు. బస్తీలో కొందరికి పట్టాల సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి అర్హులందరికీ పట్టాలు వచ్చేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బల్వంత్‌రెడ్డి, ముప్పిడి మధుకర్, బద్రినాథ్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, సదానంద్ గౌడ్, మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

**డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి**


పారిశుధ్య సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: వర్షాకాలం నేపథ్యంలో విషజ్వరాలు, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాలను, కాలనీలు, బస్తీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తార్నాక డివిజన్ లాలాపేటలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఇసుక బాయి బస్తీ, లాలాపేట ఓపెన్ నాలా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, జయశంకర్ స్టేడియంలోని ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కార్మిక విభాగం నాయకులు మోతె శోభన్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సుభాష్, డీఈ వెంకటేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాణిగంజ్ డిపో ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన


రాణిగంజ్ ఆర్టీసీ డిపో ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన కార్మికులు

పద్మారావునగర్: రాణిగంజ్ ఆర్టీసీ డిపో ముందు మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు కార్మికులు ఆందోళనకు దిగారు. జేఏసీ కన్వీనర్ సుద్దాల సురేష్, కె. రఘురాం, బీడీ రావు, శంకర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు రావలసిన రెండు వేతన సవరణలను అమలు చేయాలని కోరారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**డాక్టర్ కోట నీలిమ**


దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: దేవాలయాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని, ఆ దిశగా నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు సాగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. పాన్‌బజార్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని మంగళవారం సందర్శించి అక్కడ జరిగిన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ఇక్కడి సమస్యలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి.మనోజ్‌కుమార్, నాయకులు గంటా సుధీర్, ఎస్ఆర్ శివకుమార్, నాగరాజ్, శీలం అనురాగ్, చందు, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన


వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శ్రావణమాస లక్ష పుష్పార్చన ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవారం అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు సమర్పించారు. శ్రావణ మాసంలో ప్రతి మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తోందని అధికారులు తెలిపారు.

# లష్కర్ బస్తీలకు సుస్తీ

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కిటకిట
- నామమాత్రంగా వైద్యం, పారిశుధ్యం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలోని బస్తీల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాల బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ప్రాంతంలోని 15 ప్రాథమిక ఆరోగ్యా కేంద్రాలకు రోజుకు కనీసం 250 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఇందులో వంద మంది దాకా జ్వరం, జలుబు, 30 మంది దగ్గు, మిగిలినవారు వాంతులు, విరోచనాలతో ఆసుపత్రులకు వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. కాగా, జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించిన బస్తీలు సికింద్రాబాద్‌లో వంద వరకు ఉన్నాయి. ఎక్కువ శాతం బస్తీల్లో పారిశుధ్య చర్యలు అంతంతమాత్రమే. వర్షాకాలం నేపథ్యంలో ఈ నెల మొదటి వారంలో అన్ని డివిజన్లలో పారిశుధ్యం, పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ తరువాత ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని బస్తీల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. మరికొన్ని బస్తీలను ఆవరించి మురుగునీటి నాలాలు ఉన్నాయి. వీటి ద్వారా దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. అనారోగ్యం బారిన పడుతున్న ఆయా బస్తీల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దోమల నివారణకు మందుల పిచికారీ, డ్రైడే, పాతసామాన్ల తొలగింపు, స్వచ్ఛత వంటి కార్యక్రమాలను తూతూమంత్రంగా చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. అవగాహన కార్యక్రమాలు చిత్తశుద్ధితో నిర్వహించని ఫలితంగానే బస్తీల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బీదలబస్తీలో సరఫరా అయిన కలుషితనీరు

### వైద్యంలో వసతుల లేమి...

15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కేవలం ఏడింటిలో మాత్రమే రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. మిగతా కేంద్రాల్లో వైద్యులు, ఇంకొన్నింటిలో సిబ్బంది కొరత ఉంది. సరిపడా మందులు కూడా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండటం లేదని రోగులు చెబుతున్నారు. ప్రాథమిక ఆసుపత్రులకు వచ్చే రోగులకు సలహాలు, సూచనలు చేయడం, గాంధీ ఆసుపత్రికి సిఫారసు చేయడంతో మాత్రమే సిబ్బంది సరిపెడుతున్నారు. మరోవైపు లెక్కకు మించిన సంఖ్యలో ప్రజలు విషజ్వరాలు, అనారోగ్యం బారిన పడుతున్నప్పటికీ నివారణ కోసం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని జీహెచ్‌ఎంసీ, జలమండలి, వైద్య అధికారులు చెబుతుండటం గమనార్హం.


లాలాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బారులు తీరిన రోగులు

## మెడికల్ కోడింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

అడ్డగుట్ట: మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ నిమిత్తం బుధవారం తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అప్నా టెక్ మహీంద్రా ఫౌండేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ నాలుగు నెలలపాటు ఇచ్చే ఈ శిక్షణలో 20–28 ఏళ్ల వయస్సు గల యువత అర్హులని తెలిపారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకామ్, ఎంకామ్ విభాగాలలో ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 91549 90132, 91549 90130 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఒకటిన లక్ష బిల్వార్చన

సనత్‌నగర్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సెప్టెంబర్ ఒకటవ తేదీన లక్ష బిల్వార్చన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ విఠలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి ప్రీతికరమైన మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

## అర్హులందరికీ 'గృహజ్యోతి': ఎమ్మెల్యే

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో అర్హులందరికీ గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మంగళవారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అర్హులై ఉండి కూడా గృహజ్యోతి పథకం కింద తమకు లబ్ధిచేకూరడం లేదంటూ పలువురు తనకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది కంటోన్మెంట్ వార్డులు, మోండా డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ వినియోగ మీటర్ వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు రవి కుమార్, సచింద్రన్, రామాచారి, విజయ్ కుమార్, నరేష్‌రెడ్డి, సాయి జగదీష్, భరత్, అర్పిత, వంశీధర్‌రెడ్డి, రాకేష్, శ్రీధర్, రామానుజచారి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: తలసాని

రాంగోపాల్‌పేట్: ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కరీంకాంపౌండ్‌లో పర్యటించి సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీ నిర్మాణం పూర్తయినా రోడ్డు మరమ్మతు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. నల్లాల ద్వారా వచ్చే నీరు కలుషితం అవుతోందని, వీధి దీపాలు వెలగడం లేదని, ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు వేలాడుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిశోర్‌కుమార్, లతీఫ్, జబ్బార్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న తలసాని

## రాకపోకలకు ఇబ్బందికరంగా కరెంట్ స్తంభాలు

లాలాపేట: లాలాగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కొత్త స్తంభాలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాలాపేట, శాంతినగర్ ప్రాంతాల్లో కొన్ని బహుళ అంతస్తులు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణదారులతో అధికారులు, ఎలక్ట్రిసిటీ గుత్తేదార్లు కుమ్మక్కై కరెంట్ స్తంభాలను ఇష్టారాజ్యంగా మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానిక కాలనీలు, బస్తీల ప్రజల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటున్నారు. చిన్న, చిన్న గల్లీ రోడ్లలో కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తూ స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కిందిస్థాయి అధికారులు చేస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ బస్తీలో 30 ఫీట్ల రోడ్డులో వేయాల్సిన కరెంట్ స్తంభాన్ని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా 10 ఫీట్ల గల్లీలో ఏర్పాటు చేశారని లాలాపేటకు చెందిన కుమ్మరి ఆంజనేయులు తెలిపారు. దీనిని వెంటనే తొలగించాలని కోరారు.

## అత్యవసర సమయంలోనే అంబులెన్స్ సైరన్

**గ్రేటర్ అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్**

బన్సీలాల్‌పేట్: రోగులను అత్యవసర వైద్యసేవలు అందించేందుకు తరలించే సమయంలో మాత్రమే డ్రైవర్లు సైరన్ వాడాలని గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్ సూచించారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న తెలంగాణ ప్రైవేట్ అంబులెన్స్ సర్వీసెస్ పాయింట్ వద్ద మంగళవారం డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల నగర పోలీసు కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలు, పోలీసులు సూచించిన విషయాలను ఆయన వివరించారు. ట్రాఫిక్ ఈస్ట్ జోన్ డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ సంపత్, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంబులెన్స్‌లో రోగులు లేనప్పుడు సైరన్ వాడరాదని, ప్యాసింజర్లను అంబులెన్స్‌లో ఎక్కించకూడదని, సరైన డాక్యుమెంట్లను వాహనంలో పెట్టుకోవాలని సురేష్ సూచించారు. కార్యక్రమంలో మజహర్, నరేందర్, సాదిక్, ముఖేష్, లాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సురేష్

## ఒకటిన మట్టి వినాయక ప్రతిమల తయారీపై పోటీలు

సనత్‌నగర్: వినాయక చవితి సందర్భంగా మోడల్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 1న బాలబాలికలకు మట్టి గణపతి ప్రతిమల తయారీ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు 14 సంవత్సరాల వయసులోపు పిల్లలకు మాత్రమే అవకాశం ఉంటుందని, ప్రతిమ తయారీకి మట్టిని తామే అందిస్తామని, గణపతిని అలంకరించే వస్తువులు ఎవరికివారే తెచ్చుకోవాలని తెలిపారు. ఆసక్తి గల పిల్లల పేర్లను వారి తల్లిదండ్రులు 80083 52140 నెంబర్ వాట్సాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మోడల్ కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

## అక్టోబర్ 24న పీడీఎస్‌యూ 50 ఏళ్ల ఆవిర్భావసభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో అక్టోబర్24న పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు విద్యార్థి నేతలు తెలిపారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు నాగరాజు, మహేష్ మాట్లాడుతూ వచ్చే నవంబర్‌లో సీపీఐఎంఎల్–న్యూడెమోక్రసీ విప్లవ పార్టీలు ఏకం కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విప్లవ పార్టీలకు అనుబంధంగా పనిచేస్తున్న రెండు పీడీఎస్‌యూ కమిటీలు ఐక్యత దిశగా కొనసాగుతూ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఓయూ అధ్యాపకులు కొండా నాగేశ్వర్‌రావు, నారాయణ, పీడీఎస్‌యూ నేతలు రంజిత్, మధు, ఎస్వీ శ్రీకాంత్, గడ్డం శ్యామ్, నవీన్, శ్రీను, శ్యామ్, ఝాన్సీ, ఆసిఫ్, గౌతం శ్రీరామ్, వంశీ, రహీం తదితరులు పాల్గొన్నారు.

## 31న శ్రావణ మంగళ గౌరీ మహాలక్ష్మీ కుంకుమార్చన

సనత్‌నగర్: శ్రావణమాస విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో ఈ నెల 31 చివరి శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవిష్ణు సహస్రనామ, సత్సంగ్ సభ్యుల సహకారంతో ఉదయం 10 గంటలకు 1,008 మంది మహిళలతో హరిహరులకు విశేషంగా లలిత, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, లింగాష్టకం, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని పేర్కొన్నారు. తదుపరి మహిళలందరిచే సామూహికంగా శ్రావణ మంగళగౌరీ మహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## అట్టడుగు వర్గాల సాధికారితే లక్ష్యం

**మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ సీవోవో శ్రవణ్‌కుమార్**

రాంగోపాల్‌పేట్: అట్టడుగు వర్గాల యువత భవిష్యత్తును ఉన్నతస్థాయికి తీసుకుని వెళ్లి వారికి ఉత్తమ అవకాశాలు కల్పించేందుకు మైండ్‌స్పేస్ ఆర్ఈఐటీ కృషి చేస్తుందని ఆ సంస్థ సీవోవో శ్రవణ్‌కుమార్ గోనె తెలిపారు. మంగళవారం ఎస్పీరోడ్ మినర్వా కాంప్లెక్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకులు మయూర్ పట్నాలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్మాణ్ ఎన్‌జీవో ద్వారా తమ సంస్థ ఆర్థికంగా వెనుకబడిన యువతలో నైపుణ్యాలు, ఉపాధి కల్పనకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి చదువు లేనివారు మొదలు బీటెక్ వరకు చదివినవారు ఉద్యోగులు పొందేందుకు 3 నెలలపాటు ఎలక్ట్రీషియన్, సోలార్ పీవీ ఇన్‌స్టలేషన్, ఫుల్–స్టాక్ జావా డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, , బ్యూటీషియన్, టైలరింగ్, ఫుడ్ అండ్ బేవరేజి, రిటైల్, ఐటీ నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. సికింద్రాబాద్, చందానగర్, ఈసీఐఎల్, సురారంలో యువతతోపాటు మహిళలను ఆర్థికంగా నిలబెట్టేలా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సీఎస్ఆర్‌లో భాగంగా రూ.2 కోట్లు ఖర్చు చేసి పైలట్ ప్రాజెక్టులో భాగంగా 480 మంది శిక్షణలో ప్రవేశించగా 120 మంది శిక్షణ పూర్తి చేసికుని ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సేవలు విస్తరించి 2 వేల నుంచి 2,500 మంది యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శిక్షణ, ఉపాధి పొందిన యువత తమ అనుభవాలను పంచుకున్నారు.


సంస్థ కార్యకలాపాల గురించి వివరిస్తున్న శ్రవణ్‌కుమార్ గోనె

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

**బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి**

సనత్‌నగర్: కనిపించకుండా కనికట్టు చేసి మోసం చేసే సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి విద్యార్థినులకు సూచించారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ'అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ తమ ఫోన్లకు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను తెరవకపోవడమే ఉత్తమమన్నారు. ముఖ్యంగా ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని సూచించారు. నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయనే అంశాలపై అవగాహన కలిగి ఉండి తదనుగుణంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. తమకు తాము అవగాహన కలిగించుకోవడమే కాకుండా తోటి వారికి సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జయచందర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సెక్రటరీలు నర్సింహులు, సరిత, మధుకర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

## చికిత్స పొందుతూ గృహిణి మృతి

ఉప్పల్: వరకట్న వేధింపులు భరించ లేక ఆత్మహత్యకు యత్నించిన గృహిణి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఉప్పల్ పోలీసుల వివరాల ప్రకారం. ఉప్పల్ సత్యానగర్‌కు చెందిన బొడ్డుపల్లి శివకోటయ్యచారి(34) ప్రైవేట్ ఉద్యోగి. స్వస్థలం మిర్యాలగూడ తుంగపాడు. నల్గొండ జిల్లా కేతపల్లికి చెందిన అక్కెనపల్లి వాసవి(30)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. 14 తులాల బంగారం, కిచెన్ వస్తువులు రూ. 2లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. వీరికి కుమారుడు వేదిక్ సాయి ఉన్నాడు. అదనపు కట్నం కోసం కొన్ని నెలలుగా భార్యతో గొడవపడుతున్నారు. పెద్దలు మాట్లాడి వెళ్లారు. కానీ కట్నం సమస్య తీరలేదు. ఈనెల 25న మధ్యాహ్నం గొడవ తారా స్థాయికి చేరింది. దీంతో వాసవి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యయత్నం చేసింది.

## వైభవంగా శ్రీకృష్ణ జయంత్యోత్సవాలు


శ్రీకృష్ణ జయంత్యోత్సవాల్లో సంప్రదాయ కూచిపూడి నృత్య కళాకారిణులతో ఏపీ మంత్రి సత్యకుమార్‌యాదవ్, వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు

సనత్‌నగర్: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో 65వ శ్రీకృష్ణ జయంత్యోత్సవాలు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గోపూజ, కూచిపూడి నృత్య కార్యక్రమాలు, మిమిక్రీ ప్రదర్శన, వట్టికోట రామానుజాచార్యులుచే శ్రీకృష్ణ లీలాగానామృతం, శ్రీకృష్ణ జనన పూజ, డోలారోహణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఏపీ మంత్రి సత్యకుమార్‌యాదవ్, సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లుయాదవ్, కూరాకుల నాగభూషణం యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, నాయకులు పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, బొంతు శ్రీదేవియాదవ్, నవీన్‌యాదవ్ హాజరయ్యారు. రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ అతిథులను శాలువాలతో సత్కరించి మెమొంటోలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు జంగిటి మురళీయాదవ్, నాగెల్లి అంజన్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, బొట్టా మధుయాదవ్, కృష్ణయాదవ్, ఆది యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం అన్నదానం

రసూల్‌పురా: బొల్లారం యాదవ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో యాదవ సంఘం కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు మురళీయాదవ్, గజ్జల గోపాల్, ఆనంద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.


యాదవ సంఘం అన్నదానంలో పాల్గొన్న నివేదిత సాయన్న

## శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సీతాఫల్ మండిలోని శ్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించే శ్రీ కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు రాష్ట్ర జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు తీగుళ్ల కిషోర్‌గౌడ్, శ్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు బొగ్గుల కృష్ణ, చెన్నయ్యగౌడ్, భాస్కర్‌రావు, అశ్విన్‌కుమార్, వైవీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణాష్టమి వేడుకలకు హాజరైన జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా